క్లుప్తంగా

లో ఓల్టేజీతో కాలిపోతున్న తాగునీటి మోటార్లు



కేపీ అగ్రహారంలో లోఓల్టేజీ వస్తున్న డీపీ

బుచ్చెయ్యపేట : కేపీ అగ్రహారం గ్రామంలో లోఓల్టేజీతో పలు మోటార్లు కాలిపోతున్నాయి. గ్రామంలో సుమారు 400కి పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ కనెక్షన్లకు సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో లోఓల్టేజీ సమస్య ఏర్పడుతుంది. లో ఓల్టేజీ కారణంగా గ్రామంలో ఉన్న తాగునీటి మోటార్లతో పాటు పలువురి ఇళ్లల్లో ఉన్న మోటార్లు కాలిపోతున్నాయి. మోటార్లు పనిచేయక గ్రామంలో మంచినీటి ట్యాంకులకు సరిపడా నీరు అందక గ్రామస్తులకు తాగునీటి కష్టాలు ఏర్పడుతున్నాయి. తక్షణం విద్యుత్‌శాఖ అధికారులు గ్రామంలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, ఉప సర్పంచ్ మునలినాయుడు గ్రామస్తులు జి.నూకరాజు, నాయుడు, లక్ష్మి, అప్పలరత్నం కోరుతున్నారు.

వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె. మురళీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెలాఖరులోపు ప్రవేశాలు పొందవచ్చునన్నారు. కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం ఏటా జాబ్ మేళాలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. వృత్తి విద్యా కోర్సులు ఎంఈటి, రెండేళ్ల కోర్సు, పాలిటెక్నిక్‌లో రెండో ఏడాది ప్రవేశాలు పొందవచ్చునన్నారు. దీంట్లో చేరేందుకు ఐదు శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. అలాగే ఈఈటీ కోర్సు ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన కోర్సు. దీంతో పాటు సిఈటీ కోర్సు సివిల్ ఇంజినీరింగ్ చేయాలనుకునే వారికి పునాదిగా ఉపకరిస్తుందన్నారు. దీంతో పాటు ఎంపిహెచ్ డబ్ల్యూ(యఫ్) కోర్సు చేసిన బాలికలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కోర్సులకు నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నూకాలమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



అడిగర్లపాలెంలో నూకాలమ్మను దర్శించుకుంటున్న గణేష్, తదితరులు

మాకవరపాలెం : నూకాలమ్మ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ దర్శించుకున్నారు. మండలంలోని అడిగర్లపాలెంలో రూ.10 లక్షలతో గత ప్రభుత్వ హయాంలో నూకాలమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ ఆలయంలో ఉమాశంకర్‌గణేష్ అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, మామిడిపాలెం, తూటిపాల, బూరుగుపాలెం సర్పంచ్‌లు బుద్దా రమణ, గవిరెడ్డి ప్రసాదరావు, వొబ్బలరెడ్డి వెంకటరమణ, నాయకులు రుత్తల రాజు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి పైప్‌లకు మరమ్మతులు



కె.జె.పురం హైస్కూల్లో మంచినీటి పైపులకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

మాడుగుల రూరల్ : పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకున్నామని కె.జె.పురం హైస్కూలు కమిటీ చైర్మన్ కర్రి సంతోష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన పాఠశాలలో తాగునీటి పైపులకు మరమ్మతులు చేపట్టారు. పాఠశాల ఆవరణలో గల రక్షిత మంచినీటి పథకం నుంచి నేరుగా పైపుల ద్వారా పాఠశాల భవనం మీద వున్న మినీ ట్యాంకులకు నీటిని అందించేందుకు మరమ్మతులు చేపట్టినట్టు తెలిపారు. ఈ మరమ్మతు పనుల్లో పాఠశాల నైట్ వాచ్‌మన్ దాడి జగతి, డ్రాయింగ్ ఉపాధ్యాయులు రాజు సహకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావికమతం : కొత్తకోట విద్యుత్ సబ్‌స్టేషన్ దొండపూడి ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్, వార్షిక మరమ్మతు పనులు సోమవారం చేపడుతున్నట్టు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ చెప్పారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దొండపూడి, మత్స్యవానిపాలెం, టి.అర్జాపురం, కిత్తంపేట, ఆర్.కొత్తూరు, చిలకవానిపాలెం గ్రామంలో, మేడివాడ సెక్షన్ పరిధిలో మేడివాడ, పి.పొన్నవోలు తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బస్టాండ్‌కెళ్లాలంటే తిప్పలే..!

తాత్కాలిక పనులతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి వర్షాకాలంలో బస్టాండు ఆవరణ చిత్తడిగా మారుతున్నా తాత్కాలిక పనులు తప్ప.. శాశ్వత మరమ్మతులు చేపట్టడం లేదు. ఫలితంగా కొద్దిపాటి వర్షం కురిసినా బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

- వర్షాలకు చిత్తడిగా మారుతున్న బస్టాండ్ ఆవరణ
- తాత్కాలిక పనులతో తప్పని అవస్థలు
- శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రయాణికుల డిమాండ్



ఇరవై రోజుల క్రితం బురదతో చిత్తడిగా మరిన బస్టాండు ఆవరణ



ఈ నెల 2న బస్టాండు ఆవరణకు చేసిన తాత్కాలిక మరమ్మతులు

మాకవరపాలెం : మండల కేంద్రంలో సుమారు 20 ఏళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండు నిర్మించారు. ఈ స్టాండు నుంచి మండలంలో ఉన్న 31 పంచాయతీల ప్రజలే కాకుండా కోటవురట్ల, రోలుగుంట మండలాలకు చెందిన వందలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే వర్షాకాలంలో ఈ స్టాండు ఆవరణ చిత్తడిగా మారి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులు పెడుతోంది.

ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్య..

అధ్వానంగా ఉన్న ఈ బస్టాండు ఆవరణ సమస్య ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదు. పదేళ్లుగా ఏడాది, రెండేళ్లకోసారి వర్షాలకు దెబ్బతిన్న ఈ ఆవరణకు తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. శాశ్వత పనులు చేపట్టడంతో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో నిత్యం ప్రయాణికులు కష్టాలు పడుతున్నారు. గతేడాది వర్షాలకు గోతులు పడడంతో ఈ జనవరి నెలలో మెటల్, ఫ్లైయాష్ వేసి అయిందనిపించారు. మరలా గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. ఈ నేపథ్యంలో ఈ నెల 2న మళ్లీ మెటల్, ఫ్లై యాష్‌తో గోతులను కప్పి వదిలేశారు.

ఫలితం లేని తాత్కాలిక పనులు..

ఈ బస్టాండు ఆవరణకు రూ.వేలు, రూ.లక్షల్లో ఖర్చు చేసి తాత్కాలిక పనులు చేపట్టడం ఏమాత్రం ఫలితాన్నివ్వడం లేదు. 15 రోజుల క్రితం మరమ్మతులు చేసినా ఆదివారం కురిసిన వర్షానికి మరలా ఆవరణంతా చిత్తడిగా మారి బురదమయమైంది. దీంతో అడుగు పెట్టేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సు ఎక్కే సమయంలో బట్టలకు బురద అంటుకుపోతుందని విద్యార్థులు, ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఆవరణకు శాశ్వత పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆదివారం కురిసిన వర్షానికి మరలా చిత్తడిగా మారిన ఆవరణ

శాశ్వత పనులు చేయాలి



చిత్తడిగా ఉన్న బస్టాండు ఆవరణలోకి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఆవరణకు శాశ్వత మరమ్మతులు చేయాలి. తాత్కాలిక పనులతో నిధుల వృథా తప్ప, ఫలితం ఉండడం లేదు.

–కాగిత బుజ్జి, మాకవరపాలెం

అధికారులు స్పందించాలి



ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించేందుకు అధికారులు స్పందించాలి. వర్షం కురిస్తే ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు నానా కష్టాలు పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–అడిగర్ల రాంబాబు, రాచపల్లి

బుచ్చెయ్యపేట జంక్షన్‌లో నిలిచిపోతున్న నీరు



బుచ్చెయ్యపేట జంక్షన్‌లో రోడ్డుపై నిలిచిపోయిన నీరు

బుచ్చెయ్యపేట : మండల కేంద్రంలో నాలుగు రోడ్ల జంక్షన్‌లో వర్షం నీరు నిల్వ ఉండిపోగా పలువురు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జంక్షన్‌లో బంగారుమెట్ట, బుచ్చెయ్యపేట రోడ్డు వైపు ఏ మాత్రం వర్షం కురిసిన రోడ్డుపైనే నీరు ఉండిపోతుంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారు ఇళ్ల ముందు మట్టి వేసి ఎత్తు చేశారు. రోడ్డుపై ఉన్న నీరు మాత్రం బయటకు వెళ్లకుండా చేశారు. నిత్యం వేలాది మంది ప్రజలు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, వ్యవసాయశాఖ, విద్యాశాఖ కార్యాలయాలకు పలు పనులపై వస్తుంటారు. వారంతా నీటిలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. పలు శాఖల అధికారులు ఇదే మార్గంలతో రాకపోకలు సాగిస్తున్నా వరద నీరు దుస్థితి పట్టించుకోవడం లేదు. తక్షణం రోడ్డుపై నీరు బయటకు పోయేలా పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా శివాలయం వార్షికోత్సవం



ఎం.అలమండ శివాలయంలో హోమం చేస్తున్న భక్తులు

దేవరాపల్లి: ఎం.అలమండలో శివాలయం 20వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ నియమ నిష్టలతో హోమం జరిగింది. స్వామి వారికి 101 కలశాలతో భక్తులు అభిషేకాలు చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీగా అన్న సమారాధన జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

పాడిరైతుకు వైఎస్సార్‌సీపీ నేతల ఆర్థిక సాయం



రైతుకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

చీడికాడ :పిడుగుపాటుతో రెండు ఆవులను కోల్పోయిన బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని, ఆవులకు నష్టపరిహారం చెల్లించాలని ఎంపీపీ కురుచా జయమ్మనారాయణమూర్తి, వైయస్ ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, సీడీసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఖండివరంలో గల బాధిత రైతు జనపరెడ్డి కళ్యాణం కల్లానికి వెళ్లి ధైర్యం చెప్పారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సూచనల మేరకు తమ వంతు సహకారంగా రైతుకు రూ.10 వేలు అందించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గెంజి స్వాతి బాలాజీ, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేకు సూర్యనారాయణ, పార్టీ యూత్‌అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, పార్టీ నేతలు మోసూరి సన్నిబాబు, గెంజి కృష్ణ, సుంకర కొండబాబు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న వ్యాపారి బంగారం, కొత్తకోట వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం : కొత్తకోట గ్రామానికి చెందిన వ్యాపారి పెనుగొండ బంగారం 85వ పుట్టినరోజు వేడుకలను గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో గల వృద్ధులు, పారిశుధ్య కార్మికులు 85 మందికి రగ్గులు పంపిణీ చేశారు. బంగారానికి సర్పంచ్ కోన లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా, వైఎస్సార్ సీపీ నాయకులు గుమ్ముడు సత్యదేవ,ఆదిమూర్తి, దొరబాబు, పుల్లా నాని, గున్నాజీ, వాసు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

సర్పంచ్ శ్రీనివాసరావును పరామర్శించిన అమర్‌నాథ్



గజపతినగరం సర్పంచ్ మళ్ల శ్రీనివాసరావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

చోడవరం : పార్టీ సీనియర్ నాయకులు, గజపతి నగరం సర్పంచ్ మళ్ల శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం పరామర్శించారు. శ్రీనివాసరావుకు ఇటీవల అనారోగ్యం కారణంగా కాలు తొలగించడంతో ఆయన ఇంటి వద్ద విశ్రాంతిలో ఉన్నారు. పరామర్శించేందుకు వచ్చిన అమర్‌నాథ్ ఆయనకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని, మనోధైర్యంతో ఉండాలన్నారు. శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అమర్ వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యువజన, రైతు విభాగాల అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, బొడ్డేడ సూర్యనారాయణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, సేవాదళ్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, అప్పికొండ లింగబాబు పాల్గొన్నారు.

టైప్‌–4 కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కె.కోటపాడు : కె.కోటపాడు హైస్కూల్‌లో గల టైప్–4 కేజీబీవీలో చేరేందుకు గల ఆసక్తి గల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారులు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. ఈ టైప్–4 కేజీబీవీలో 9, 10, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో చేరు విద్యార్థులు ఈ నెల 30లోగా అడ్మిషన్‌లను పొందాలని కోరారు. టైప్–4 కేజీబీవీలో హాస్టల్ సదుపాయం ఉందని, కుల, ఏడాదికి రూ.లక్షా 44వేల ఆదాయం లోపుగా ఉన్న ధ్రువపత్రాలతో కె.కోటపాడు హైస్కూల్ హెచ్ఎంకు దరఖాస్తు అందించాలని సూచించారు. అనాథలు, సెమీ అనాథలు, వైకల్యం ఉన్న విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని అన్నారు. తదుపరి రిజర్వేషన్‌ల నియమాన్ని పాటిస్తూ మిగిలిన సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్ తెలిపారు.

సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ



సర్పంచ్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట : చింతపాక సర్పంచ్ గొలజాన శ్రీను కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. సర్పంచ్ శ్రీను తమ్ముడు చిన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం అమర్‌నాథ్, జెడ్పీటీసీ దొండా రాంబాబుతో కలిసి సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నతనంలోనే చిన్న మృతి పార్టీకి తీరని లోటని, చిన్న కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అమర్ తెలిపారు. పీపీ అగ్రహారంలో ఉప సర్పంచ్ నైదాన రాజును అమర్‌నాథ్ కలుసుకున్నారు. పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో నోములు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ప్రతి శనివారం భక్తులు 7 సార్లు పసుపు కొమ్ములు, 7 రూపాయలు, 7 తమలపాకులు పట్టుకుని ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ విధంగా 7 శనివారాలు నోములు పూర్తి చేసిన భక్తులు దేవాలయ కమిటీ వారికి రూ.116 చెల్లించి, 8వ శనివారం ప్రదక్షిణ చేసి, అర్చకులకు స్వయంపాకం సమర్పించి అన్నప్రసాద వితరణలో పాల్గొనాలని ఆలయ చైర్మన్ రాపేట రామకొండలరావు తెలిపారు. ప్రతి శనివారం పూజలు అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులోని మోదకొండమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఒడ్డు పండగలు నిర్వహించి, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు కొమాళ్లపూడికి చెందిన రావి సత్తిబాబు సాయిదుర్గ కుటుంబ సభ్యుల సహకారంతో ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ

- చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి అమర్‌నాథ్



కంచుగుమలలో వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్

రోలుగుంట : మోసాల పార్టీ కాదు మనది.. మాట నిలబెట్టుకునే పార్టీ అని వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కంచుగుమల గ్రామంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్త కంఠంరెడ్డి శేషు ఇంట్లో ఆదివారం జరిగిన ఒక శుభకార్యక్రమంలో అమర్‌నాథ్, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆ సెగ్మెంటు ఎంపీటీసీ వడ్డాది సతీష్‌తో కలసి పాల్గొన్నారు. ఆయనను వైస్ ఎంపీపీ దోసపత్ని రాజు, పార్టీ యువజన నాయుకుడు కన్నడ హీరో గొందు సిద్దు, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రమణ, మాజీ సర్పంచ్ తమటపు సత్యంనాయుడు. కార్యకర్తలు శానాపతి సత్యనారాయణ, కంఠంరెడ్డి రాజారావు, రాజులనాయుడు, ఈశ్వరరావు, కృష్ణ తదితరులు కలిశారు. వారితో పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని, మీకు అండగా పార్టీ ఉంటుందని భరోసా ఇచ్చారు. జనం ఇప్పటికీ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలు, మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఎం.అలమండలో అభివృద్ధి పనులు



ఎం.అలమండలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం తదితరులు

దేవరాపల్లి : అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా ఎం.అలమండ గ్రామం నిలుస్తుందని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. ఎం.అలమండలోని ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా నిరుపయోగంగా ఉన్న రెండు సామాజిక భవనాల మరమ్మతుల నిమిత్తం రూ. 9.70 లక్షల జిల్లా పరిషత్ నిధులను జెడ్పీటీసీ మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టే పనులకు ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలం నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, సర్పంచ్ దాడి జగన్, ఎంపీటీసీ పోతల వెంకటరావు ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ రిటైర్డ్ డివినల్ ఇంజినీర్ యామాద్రి పోలీస్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బండారు ప్రసాదరావు, యర్రా నర్సింహమూర్తి, కొండా బత్తిన వేణు పాల్గొన్నారు.

కెనాల్ మార్గంలో రాళ్లు తేలిన రోడ్డు



దాలివలస కెనాల్ మార్గంలో రాళ్లు తేలిన ప్రాంతం



గవరపాలెం కెనాల్ మార్గంలో రాళ్లు తేలిన దృశ్యం

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల గుండా ఉన్న రైవాడ కెనాల్ మార్గం వెంబడి ఉన్న గ్రావెల్ రోడ్డు మార్గం అధ్వానంగా మారింది. గతంలో నిర్మాణం చేపట్టిన మట్టిరోడ్డు మార్గంలో ప్రస్తుతం రాళ్లు తేలి ఉండడంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణం చేసే సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉగ్గినవలస, ఆర్.వై. అగ్రహారం, కొరువాడ, డి.అగ్రహారం, గవరపాలెం, దాలివలస, రామచంద్రపురం, కె.కె.అగ్రహారం గ్రామాల గుండా ఈ కెనాల్ మార్గాన్ని ఆనుకొని సమీప గ్రామాల ప్రజలు రాకపోకలు చేసేందుకు గ్రావెల్ రోడ్డును నిర్మాణం చేపట్టారు. ఈ గ్రావెల్‌రోడ్డును నిర్మాణం జరిపి నేటికి సుమారు 20 ఏళ్లు పైబడి కావస్తుంది. ఈ కెనాల్‌ను ఆనుకొని ఉన్న గ్రావెల్ రోడ్డు మార్గం గుండా వాహనాలు రాకపోకలు సాగించడంతో పాటు, వర్షాలు పడే సమయంలో రోడ్డు పైభాగంలో గ్రావెల్ తొలగిపోవడంతో అడుగున గల మెటల్ రాళ్లు బయటకు తేలాయి. రాళ్లు తేలిన రోడ్డు మార్గం పక్కగా కెనాల్ గుండా నీటి ప్రవాహం జరగడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ఎదుర్కోవాల్సి వస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ మట్టిరోడ్డు మార్గంలో పెద్ద పెద్ద గోతుల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో గోతుల పరిస్థితిని గుర్తించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాళ్లు తేలిన మార్గాన్ని జీవీఎంసీ అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

500 ఘటాలతో మోదకొండమ్మ వీధి పండగలు



మోదకొండమ్మ ఘటాలు శిరస్సున పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళుతున్న భక్తులు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ వీధి పండగలు వందలాది మంది భక్తులు ఆదివారం నిర్వహించారు. సుమారు 500 మంది భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని డప్పులు, వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఆలయానికి కాలినడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. మాడుగుల గవర వీధికి చెందిన పెంటకోట కొండబాబు, లక్ష్మి కుటుంబ సభ్యులు 101 ఘటాలు, అర్బన్ కాలనీకి చెందిన పోతక కళ్యాణం కుమారులు ఈశ్వరరావు, జగ్గారావు, కుటుంబ సభ్యులు 101 ఘటాలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన మరో 300 మంది భక్తులు ఘటాలు శిరస్సున పెట్టుకుని పండగ చేశారు. ఈ పండగలో నూతనంగా ఎన్నుకోబడిన 16 మంది కమిటీ సభ్యులు సేవలందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాలిమేర విజయలక్ష్మి, పాలిమేర చిన్నారావు, బొడ్డేడ విశ్వేశ్వరరావు, బొడ్డేడ లక్ష్మణరావు, బొడ్డేడ జగన్, భీశెట్టి మోదినాయుడు, పాలిమేర వెంకటరమణ పాల్గొన్నారు.

లింగంపేటలో కూటమిలో చీలికలు

- టీడీపీ నాయకులకు జనసేన గేలం
- మండిపడుతున్న టీడీపీ వర్గాలు
- స్థానిక ఎన్నికల్లో కలసి పనిచేసేది లేదని స్పష్టం

గొలుగొండ : లింగంపేటలో కూటమిలో వర్గపోరు పురుడుపోసుకుంది. వచ్చే స్థానిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని జనసేన, టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయి పనిచేస్తున్నాయి. లింగంపేట గ్రామ పంచాయతీ చరిత్రలో గడిచిన 20 సంవత్సరాల్లో సీపీఐ, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ నేతలు మాత్రమే ఇప్పటి వరకు గెలుపొందడం జరుగుతుంది. పలు సార్లు అయ్యన్న ఈ గ్రామంలో పర్యటించిన సందర్భంలో ఇక్కడ టీడీపీకి కనీస బలం లేకపోవడం ఇక్కడ నాయకులు ఎలా పనిచేస్తున్నారో అర్థం అవుతుందని అసహనం వ్యక్తం చేసిన సందర్భాలు అనేకం. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి వర్గ పోరుతో కొట్టుకుంటున్నది. కూటమిలోని జనసేన నాయకులు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ఇటీవల జనసేనలో సలాదులు ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేర్పులు చేశారు.

ఇందులో 15 మందికి జనసేన కండువాలు కప్పడం జరిగింది. కానీ వీరంతా ఎక్కువ శాతం టీడీపీ వాళ్లే. ఇది జరిగినప్పటి నుంచి లింగంపేటలో రాజకీయం వేడెక్కింది. వచ్చే స్థానిక ఎన్నికల్లో జనసేనకు అవకాశం లేకుండా టీడీపీ అభ్యర్థిని నిలబెట్టాలని ఆలోచిస్తుంది. దీంతో బలం తక్కువగా ఉన్న జనసేన టీడీపీ కంటే బలపడి టీడీపీకి అవకాశం లేకుండా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. కూటమి పొత్తు ధర్మం తప్పి టీడీపీ నాయకులను జనసేనలో చేర్చారని ఆ పార్టీ నాయకులు జనసేనపై మండిపడుతున్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కలసి పనిచేయలేమని రెండు పార్టీ నేతలు తేల్చి చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ సుమారుగా 1250 పైచిలుకు ఓట్లు ఉన్నాయి. ఇక్కడ కంచుకోటలా ఉన్న వైఎస్సార్‌సీపీ మళ్లీ వచ్చే స్థానిక ఎన్నికల్లో జెండా ఎగురవేయడం కోసం కలసికట్టుగా పనిచేస్తున్నారు.